క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఏనుమాముల మార్కెట్, ముసలమ్మ కుంట, పైడిపల్లి, నవయుగ కాలనీ, టీచర్స్ కాలనీ, కల్యాణి నగర్, శ్రీనివాస్ కాలనీ, ఏకశిల నగర్, గణేష్ నగర్, పోచమ్మమైదాన్ సర్కిల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల ఆవరణలో హనుమకొండ జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం ప్రారంభించనున్నారు. జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ హడుప్సా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, 100 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు వర్ధమాన జనార్దన్ తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న స్పోర్ట్స్ మీట్ విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు.

శ్వేతార్క ఆలయంలో పూజలు



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో స్వామి వారికి కృష్ణనది జలాలతో పండితులు శుక్రవారం అభిషేకం చేశారు. భక్తులు తెచ్చిన నది జలాలతో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు సహస్రధారలతో అభిషేకం జరిపించారు. స్వామి వారిని పండితులు నూతన వస్త్రాలు, లక్ష పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులందరికి తీర్థ ప్రసాదాల వితరణతో పాటు అన్నపూర్ణ కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ ధర్మకర్తలు సాయి కృష్ణ శర్మ, గంగుల రాజిరెడ్డి, దేవులపల్లి సదానందం, రవి, మణిదీప్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా జీవించాలి

హన్మకొండ అర్బన్: స్వాతంత్ర్య భారతదేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, ఎలాంటి కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా జీవించాలని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆనాడే ఆకాంక్షించారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ గుర్తుచేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 74ఏళ్ల భారత రాజ్యాంగం, సవాళ్లు అనే అంశంపై జులైవాడలోని ఎస్టీ హాస్టల్‌లో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అమలు చేయడంతో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దూడపాక రాజేందర్, జిల్లా కార్యదర్శి కంచర్ల కుమారస్వామి, సీఐటీయూ నాయకులు దేవర సంపత్, నాయకులు శ్రీనివాస్, జోత్స్న, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

హసన్‌పర్తి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎంజీఎంలో చికిత్స పొందుతున్న నగరానికి చెందిన దుప్పటి మునీందర్ (61) గురువారం రాత్రి మృతి చెందారు. ఈమేరకు మృతుడి కుమారుడు దుప్పటి జీవన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పోలీసుల కథనం ప్రకారం నగరానికి చెందిన మునీందర్.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీల డ్రైవర్లకు గైడ్‌గా వ్యవహరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం రాత్రి కేయూ జంక్షన్‌లో అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. చికిత్స పొందుతూ మృతి చెందగా, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

గెలుపోటములు సహజం

ఐనవోలు : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఓటమితో కుంగిపోవాల్సిన అవసరం లేదని, గతంలో ఎన్నడూ లేనివిధంగా వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ సహకారంతో సమారు రూ. 240 కోట్ల నిధులతో అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును గౌరవించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటానని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి చేస్తామని ఆయన తెలిపారు.

జెండాకు వందనం చేస్తున్న హనుమకొండ కోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి, వరంగల్ మొదటి అదనపు జిల్లా జడ్జి ప్రేమలత



హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్త..



ఘనంగా గణతంత్ర దినోత్సవం

75వ గణతంత్ర దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నగరవాసులు ఆవిష్కరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తుచేసుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



జానపద గిరిజన విజ్ఞానపీఠంలో జెండా ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ భూక్య బాబురావు



బెటాలియన్‌లో జెండాకు వందనం చేస్తున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది



జిల్లా పరిషత్‌లో జెండావిష్కరణలో సీఈఓ రాంరెడ్డి, ఉద్యోగులు, తదితరులు



డీసీసీ భవన్‌లో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నాయకులు



హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో..



హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో..



హనుమకొండ సీపీఐ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన శ్రీనివాస్‌రావు



చాంబర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి



వేయిస్తంభాల దేవాలయంలోని కేంద్ర పురావస్తుశాఖ కార్యాలయంలో..



త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ



కాశిబుగ్గ: కాశిబుగ్గ వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తదితరులు



కాజీపేటలో జాతీయ జెండాను ఎగురవేసిన ట్రాఫిక్ సీఐ సుజాత, వాహన డ్రైవర్లు



వరంగల్ ఎల్‌బీఆర్‌నగర్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్



కాశిబుగ్గ జంక్షన్‌లో స్టాండర్డ్ హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్ చిన్నారులు



హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో జెండాకు వందన సమర్పణ చేస్తున్న పోలీసులు



మామునూరు టీఎస్ఎస్పీ కృష్ణవేణి హైస్కూల్‌లో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు



వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ మార్నేని రవీందర్ రావు, తదితరులు



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో బాపూజీనగర్‌లోని ఆపిల్ ప్లేస్కూల్ చిన్నారులు

బీవీ.రావు ఆశయ సాధనకు కృషి



కోడి గుడ్లను పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు, ధర్మారావు

కాజీపేట అర్బన్: పౌల్ట్రీ రంగ పితామహుడు డాక్టర్ బీవీ.రావు ఆశయ సాధనకు కోళ్ల రైతులు కృషి చేయాలని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సూచించారు. 31వ డివిజన్ హంటర్ రోడ్డులో నెక్ కార్యాలయంలోని బీవీరావు భవన్‌లో బీవీ.రావు 28వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ పౌల్ట్రీ రంగంలో నూతన విధానాలను ఎప్పటికప్పుడు తీసుకువస్తూ, కోళ్ల రైతుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే బీవీ.రావు ఆశయ సాధనకనుగుణంగా ఎగ్ కార్ట్ స్కీంను ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కోడి గుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోళ్ల రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు, అనురాధ దేశాయి, దండ కరుణాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, రాంప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, రమేష్‌బాబు, వేణురావు, రాజేందర్, పాత్కనూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, జబ్బార్

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో జరగనున్న ఉర్సు దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈమేరకు తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాల వాల్‌పోస్టర్లను దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమ్జద్ సాహెబ్, చాంద్‌పాషా, ముగ్దుం, షకీల్, నసీం, అమ్జద్, హుస్సేన్, నరేష్, ఇసూబ్, జమిల్, మెరాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని డాక్టర్ బైరి నిరంజన్ కోరారు. ఈమేరకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌ను వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాకారులు తమ ఆట పాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ ప్రజలకు అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ పనిచేయాలని సూచించారు. హనుమకొండ ఆర్డీఓ ఎల్.రమేష్.. ఎందరో గాంధీలు పుట్టాలి అనే తన కవితను వినిపించి సభికులను ఆకట్టుకున్నారు. కాజీపేట ట్రాఫిక్ ఎస్సై రావెళ్ల రామారావు.. మువ్వన్నెల పతాకా ముచ్చటైన పతాక అనే పాటను, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సౌరం ప్రవీణ్ కుమార్.. గలగల గజ్జెల బండి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత.. ఏ మేరీ వతన్, సమాచార శాఖ ఉద్యోగి.. ఆశా హర్ కరం అప్నా కరెంగే అనే గీతాలను ఆలపించి రంజింపజేశారు. ఈ కార్యక్రమంలో మహానగర పాలక సంస్థ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, ట్రైనీ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం



కాజీపేట: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై సీనియర్ సిటిజన్లను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం సన్మానించారు. 70 ఏళ్ల వయస్సు దాటిన 16మందిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, బొల్లెపల్లి రాజేశ్వర్, కైలాస్‌చంద్ అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, ఆవాల పురుషోత్తం రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్, కోండ్ర శంకర్, నాగపురి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు..



వరంగల్: 75వ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని ఎల్బీనగర్‌లో జాతీయ పతాకాన్ని ఝాన్సీ స్లమ్ సమాఖ్య అధ్యక్షురాలు ముస్కె ప్రమీల ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో అశోక్, కవిత, సంపత్, హైమ, స్వరూప, రాజు, కుమార్, ప్రభ, భాగ్య పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

ఐనవోలు : మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో పిండి రవీందర్‌జజ క్రికెట్, షటిల్, క్యారమ్, చెస్ కిట్లను శుక్రవారం అందించారు. అదే విధంగా క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడంతో పాటు పదోతరగతి విద్యార్థులకు రూ.వేయి చొప్పున నగదు అందించారు.

రైతు వ్యతిరేక ప్రధాని.. నరేంద్రమోదీ



ర్యాలీగా వెళ్తున్న కిసాన్ మోర్చా నాయకులు

వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో శుక్రవారం భారీ వాహన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు నేతృత్వంలో జరిగిన ర్యాలీలో రాష్ట్ర కన్వీనర్ గోనె కుమారస్వామి, జిల్లా కన్వీనర్లు ఈసంపల్లి బాబు, వీరగోని శంకరయ్య, కుసుంబ బాబురావు, సోమిడి శ్రీనివాస్, భూక్య సమ్మయ్య, ఈర్ల పైడి, చిర్ర సూరి హాజరై మాట్లాడారు. రైతాంగ ఉద్యమ సమయంలో రాతపూర్వకంగా ప్రధానమంత్రి ఇచ్చిన హామీలు, పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ వంటి హామీలు నెరవేర్చకపోగా వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. అనేక సంవత్సరాల పాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి 8గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచి శ్రామికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను పాలకులు అవలంబిస్తున్నారని ఆరోపించారు. ర్యాలీలో వివిధ రైతు సంఘాల బాధ్యులు ఇస్మాయిల్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, ఓదెల రాజన్న, మంద రవి, కుమారస్వామి, నగేష్, కృష్ణ, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

హన్మకొండ: పెన్షనర్ల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని అసోసియేషన్ నూతన డైరీని ఆవిష్కరించి, సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి నర్సింహారెడ్డి, కాసర్ల జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జి.వీరస్వామి, వెలిశోజు రామమనోహర్, బైరి నర్సయ్య, ఎస్.రాజయ్య, కాజామొహినొద్దీన్, కర్రు సుధీర్‌బాబు, సదానందం, సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంఘం సభ్యులకు గోల్డ్ కాయిన్స్ అందజేత

హన్మకొండ అర్బన్: ప్రగతి పరపతి సంఘం సభ్యులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గోల్డ్ కాయిన్స్ అందజేశారు. రెవెన్యూ కాలనీ పార్కులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రగతి పరపతి సంఘం 10వ వార్షికోత్సవం సందర్భంగా బోనాల సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పరపతి సంఘం సభ్యులకు గోల్డ్ కాయిన్స్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మానస, రాంప్రసాద్, పరపతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కాజీపేట అర్బన్: వరంగల్ రూరల్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్‌చందర్‌పై గీసుకొండ పోలీసులు నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు సూచించారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ గీసుకొండ జాన్‌పాకకు చెందిన తేజావత్ బుజ్జి అనే మహిళ అక్రమ సంపాదనకు అలవాటుపడి గుడుంబా తయారీ, అమ్మకాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారా తయారీ, అమ్మకాలపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌చందర్‌పై గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసి అట్రాసిటీ కేసు నమోదుకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ ఎల్.రామకృష్ణ, ట్రెజరర్ చంద్రమోహన్, రమేష్‌చందర్, శశికుమారి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి వీల్‌చైర్ బహూకరణ



వీల్‌చైర్, నగదు అందజేస్తున్న దాతలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌జీవోఎస్‌కాలనీలోని గజానన కమ్యూనిటీ హాల్‌లో కొండపర్తి గ్రామానికి చెందిన రిత్విక్‌రెడ్డి అనే దివ్యాంగ విద్యార్థికి వీల్‌చైర్‌తోపాటు రూ.3 వేల నగదును శుక్రవారం అందజేశారు. ధీర లయన్స్ క్లబ్ సభ్యురాలు కేవరెడ్డి మాధవి చేయూతనందించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిల్ల మహేందర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ బాధ్యులు గురిజాల తిరుపతిరెడ్డి, కలకోట్ల నరేందర్, రాజేశ్వరి, శ్రీలత, కనుకుట్ల సురేందర్, మద్దెల అనిత, శ్రీనివాసులు, వాణిరాణి, మెరుగు శ్రుతి, స్వరాజ్యం పాల్గొన్నారు.

కేయూ న్యూస్‌లెటర్ వివేచన ఆవిష్కరణ



న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో న్యూస్ లెటర్ వివేచన 19వ వాల్యూం ఒకటవ ఇష్యూను పరిపాలన భవనం వద్ద వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్లు సదానందం, శ్రీనివాస్, కృష్ణమాచార్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ నర్సింహారావు, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.